క్లుప్తంగా

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న పొన్నం అనిల్‌గౌడ్

తిమ్మాపూర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తున్నారని మన్నెంపల్లి ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ అన్నారు. గ్రామానికి చెందిన ఆరుగురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆర్థికసాయం మంజూరుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీటీసీ శైలజ, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, బీఆర్‌ఎస మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు అశోక్, శంకరయ్య, రాజమౌళి, కిష్టయ్య, శ్రీనివాస్, వెంకన్న, గంగాధర్, మహమ్మద్, స్వామీ, పర్శారములు, సంపత్, తిరుపతి రెడ్డి, వేణుకుమార్, సంపత్, సంపత్, శ్రీనివాస్, సంపత్, శ్రీనివాస్, తిరుపతి, జగదీశ్, జగన్, నవీన్ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిగురుమామిడి: ప్రజాగాయకుడు గద్దర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుర్తిలో సీపీఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పాటలతో ప్రజలను చైతన్యపర్చిన గద్దర్ ఎన్నో ప్రజా ఉద్యమాలు చేసి పేద, మధ్య తరగతి ప్రజల పక్షాన నిలిచి నినదించిన నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సీపీఐ సహాయ కార్యదర్శి అందె చిన్నస్వామి, మండల రైతు సంఘం అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి ఎండీ ఉస్మాన్‌పాషా, నాయకులు లింగమూర్తి, రాములు, దుర్గయ్య, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి, బండెల శ్రీనివాస్, పుల్లయ్య స్వామి, మల్లేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మానం



లక్ష్మీనర్సయ్యచారిని సన్మానిస్తున్న సభ్యులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కవి కోకిల తిప్పారపు లక్ష్మీనర్సయ్యచార్యులను ఆదివారం గ్రామానికి చెందిన సమన్వయ సమితి వెదిర సంఘం సభ్యుడు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. లక్ష్మీనర్సయ్యచార్యులు కృష్ణ శతకం పద్య కవిత్వం ఇటీవల రచించారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గతంలో వెంకటరమణ శతకం, లలితా స్తుతి శతకం, పద్యమాలికలు, గేయాలు రచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గాజుల ఆనందం, ధర్మపురి ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ భీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

‘బీసీలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోంది’



మాట్లాడుతున్న అంజిరెడ్డి

గన్నేరువరం: బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. అనేక దఫాలుగా ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తూ బీసీబంధుకు రూ.400 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని, కానీ 300 మంది లబ్ధిదారులకు వర్తింప చేస్తామని హామీ ఇచ్చి కొంతమందికే ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని, పథకాన్ని అర్హులైన బీసీలందరికి వర్తింపచేయాలని లేని పక్షంలో పార్టీ పక్షాన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

పేరుకే అప్‌గ్రేడ్

- పదేళ్ల క్రితం చొప్పదండి పీహెచ్‌సీ సామాజిక ఆసుపత్రిగా మార్పు
- బోర్డులు పెట్టినా పీహెచ్‌సీగా కొనసాగుతున్న వైనం
- మెరుగుపడని వైద్య సేవలు
- రూ.37.50 కోట్ల నిధుల మంజూరుతో మళ్లీ చిగురించిన ఆశలు



ఆసుపత్రి ఆవరణలో పెరుగుతున్న గడ్డి



చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

‘పదేళ్ల కిందటే సామాజిక ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినం అన్నారు.. వైద్య సేవలు, దాక్టర్ల సంఖ్య పెరుగుతుందని చెప్పిండ్రు, బోర్డులు కూడా పెట్టారు. ఏమైందో ఏమో గానీ మళ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగానే కొనసాగుతోంది.. వైద్య సేవలు మెరుగు పడలేదు.. ఓపీ సేవలు, అప్పుడప్పుడు డెలివరీలతో నెట్టుకు వస్తుండ్రు.. ఎప్పటికీ ఏదో ఒక ఖాళీ ఉంటుంది.. ఇప్పుడేమో వంద పడుకల ఆసుపత్రి అంటుండ్రు.. చీటికి మాటికి కరీంనగర్‌లోని దవాఖానాకు ఉరుకుతున్నాం. ఇప్పుడైనా చొప్పదండి పీహెచ్‌సీ రాత మారుతుందేమో చూడాలి’ అంటూ పట్టణానికి చెందిన సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు.

చొప్పదండి: చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం ముప్పై పడకల ఆసుపత్రిగా సేవలు అందిస్తోంది. పేరుకే ముప్పైపడకలు కానీ ఆసుపత్రిలో పది పడకలు కూడా కనిపించవు. ఆసుపత్రిలో డెలివరీలకు వచ్చే మహిళలకు వేసే బెడ్లు తప్పా మరిన్ని పడకలు కనిపించవు. పదేళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో వైద్య విధాన పరిషత్ ద్వారా 61 పీహెచ్‌సీలను సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో చొప్పదండి కూడా ఉంది. ఆపై అదనపు భవనాలు నిర్మించినా ప్రయోజనం లేకుండా పోయింది. దాదాపు పదేళ్ల పాటు సామాజిక ఆసుపత్రి అనే బోర్డును ఆసుపత్రికి పరిమితం చేశారు. ప్రస్తుతం సామాజిక ఆసుపత్రి అని బోర్డు రాసి, పీహెచ్‌సీ సేవలు అందిస్తున్నారని విమర్శలు రావడంతో ఆసుపత్రి బోర్డును మార్చేశారు.

ఖాళీలు భర్తీ చేయడం లేదు

ఆసుపత్రిలో ఏటా ఏదో ఒక విభాగంలో ఖాళీలు ఏర్పడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మూడు స్టాఫ్ నర్స్ ఖాళీలు ఉండగా, ల్యాబ్ టెక్నీషియన్ కూడా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. 24 గంటల ఆసుపత్రి అని పేర్కొంటుండగా, సేవలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకే కొనసాగుతున్నాయి. ఆ తర్వాత అత్యవసర సేవలు అవసరమైతే డాక్టర్‌కు ఫోన్ చేసి కరీంనగర్ నుంచి రప్పించడం తప్పా సేవలు అందుబాటులో ఉండటం లేదు. సాయంత్రం ఆసుపత్రి బోసిపోతుంది.

ఉన్న స్థలం అప్పగింత

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను పెంచేందుకు పట్టణంలోని నల్లకుంటలో రెండున్నర దశాబ్దాల క్రితం స్థలం కేటాయించారు. సగం స్థలంలో ఆసుపత్రి భవనం నిర్మించగా, పదిహేనేళ్ల కిత్రం అదనపు భవనాలు నిర్మించారు. ఆసుపత్రిని భవిష్యత్తులో అప్‌గ్రేడ్ చేస్తే సిబ్బందికి క్వార్టర్లు నిర్మించి అందుబాటులో ఉంచాల్సి వస్తుందని మిగితా సగం ప్రహరీ నిర్మించి వదిలేశారు. కాగా 2017లో స్థలాన్ని ఎమ్మెల్యే క్వార్టర్ నిర్మాణం కోసం ఉపయోగించారు. అప్పటి ప్రజాప్రతినిధి సూచన మేరకు ఈ స్థలంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మించారు. అప్పట్లో విమర్శలు వచ్చినా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఆ స్థలం విలువ వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలుస్తోంది. పైగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ప్రస్తుతం నిరుపయోగంగానే ఉంటోంది.

వైద్య సేవలు పెరుగుతాయి

డీఎంఅండ్‌హెచ్‌వో పరిధిలోని పీహెచ్‌సీలను వంద పడకల ఆసుపత్రిగా మారిస్తే సేవలు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కిందికి వెళ్తాయి. ఇటీవల వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ. 37.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆరోగ్యవైద్య కుటుంబ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఫిజీషియన్, డెంటిస్టులతో పాటు పిల్లల వైద్య సేవలు, అనస్థీషియా, గైనకాలజిస్టు, యూ రాలజీ, ఈఎన్‌టీ, ఎక్స్‌రే, స్కానింగ్ వంటివి ఇరవై నాలుగు గంటలు అందుబాటులోకి రానున్నాయి. ఏరియా ఆసుపత్రిగా పోస్టుమార్టం వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి. చొప్పదండిలో ఇరవై వేలకు పైగా జనాభా ఉండగా, పరిసర మండలాల నుంచి లక్ష మంది జనాభాకు ఆసుపత్రి ప్రధానం కానుంది. చొప్పదండిలో చేనేత, హమాలీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ మార్కెట్ కార్మికులు, వలస కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రి అప్‌గ్రేడ్ కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏడేళ్లుగా అప్‌గ్రేడ్‌పై ఊ రిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా పనులు ప్రారంభించి ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సేవలు మెరుగు

వందపడకల ఆసుపత్రిగా మారితే వైద్య సేవలు పెరుగుతాయి. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తే సిబ్బంది కూడా పెరుగుతారు. టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా ఆసుపత్రి పర్యవేక్షణ జరుగుతుంది. ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెందుతుంది.

– డాక్టర్ రమాదేవి, వైద్యాధికారి

జాతీయ జెండా ఎగరేసి దేశభక్తి చాటాలి



జాతీయ జెండాతో ఎమ్మెల్యే, తపాలా ఉద్యోగులు



చొప్పదండి: తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు

హుజూరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేసి దేశభక్తి చాటాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తపాలా శాఖ ఉద్యోగులు ఆదివారం ఎమ్మెల్యేకు జాతీయ జెండా అందజేశారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజల్లో జాతీయ భావం, దేశభక్తిని పెంపొందించేందుకు తపాలా శాఖ చేస్తున్న కృషి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఏఎస్పీ జె. అనంతరామ్ నాయక్, పోస్ట్‌మాస్టర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చొప్పదండి: మేరీ మాటి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా చొప్పదండి నియోజకవర్గ స్థాయి తిరంగా యాత్రను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పిలుపు మేరకు అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఆర్నకొండ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని చొప్పదండిలోని పురవీధుల గుండా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని విశ్వగురుగా మార్చడమే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని, ఒక్కరోజు సెలవు తీసుకోకుండా తొమ్మిదేళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, నాయకులు లక్ష్మినారాయణ, ప్రభాకర్ యాదవ్, సత్యనారాయణ, వేణు, శ్రావణ్, క్రిష్టారెడ్డి, బాల్ రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

కోరుట్లకు తరలిన పద్మశాలీలు



కోరుట్లకు తరలి వెళ్తున్న పద్మశాలీలు

హుజూరాబాద్‌రూరల్: జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి సభకు ఆదివారం సబ్బని వెంకట్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ నుంచి పద్మశాలీలు తరలివెళ్లారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీల్లో అధిక శాతం ఉన్న పద్మశాలీలు సామాజిక, ఆర్థిక పురోగతి సాధించడానికి సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా కలెక్టర్ పరికిపండ్ల నరహరి రానున్నారని, నియోజవకర్గం నుంచి సుమారు 700 మంది తరలివెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సంఘం సత్యనారాయణ, చిలుకమర్తి శ్రీనివాస్, జడల చిరంజీవి ఇప్పాలపల్లి చంద్రశేఖర్, బండి కోటేశ్వర్ ఉన్నారు.

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన పద్మశాలీ సంఘం నాయకులు కోరుట్లకు తరలివెళ్లారు. అధికశాతం ఉన్నా పద్మశాలీలకు జనాభా దమాషా ప్రకారం రాబోయే ఎన్నికల్లో అధిక శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పద్మశాలి సంఘం నాయకులు సిరిపురం సత్య నారాయణ, అలువాల విష్ణు, మోర బద్రేశం, కొలిపాల మల్లేశం, మమిడాల నాగరాజు, గోనె రాజు, రుద్ర రాజు, లక్ష్మణ్, సత్తయ్య, లక్ష్మినారాయణ, కరంచంద్, రామచంద్రం, రాములు, శ్రీశైలం, బాలనర్సు, శ్రీనివాస్, భూమయ్య పాల్గొన్నారు.

నియామకం

శంకరపట్నం: యువజన కాంగ్రెస్ శంకరపట్నం మండల అధ్యక్షుడిగా కేశవపట్నం గ్రామానికి చెందిన ఇసామొద్దీన్‌ను నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ తెలిపారు. నియామకానికి కృషి చేసిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, వినయ్, దేవరాజ్‌లకు ఇసామొద్దీన్ కృతజ్ఞతలు చెప్పారు.

చెక్కులు పంపిణీ



చిగురుమామిడి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ కొత్త వినీత ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల సమితి అధ్యక్షుడు తిరుపతి, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



హుజూరాబాద్: పట్టణానికి చెందిన ఆర్ఎంపీ మూషం రమేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి ఆదివారం తోటి ఆర్ఎంపీలు రూ.పదివేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్ఎంపీల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు పంజాల తిరుపతిగౌడ్, కార్యదర్శి సొల్లు మహేందర్, కోశాధికారి సదా నందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: బీసీల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ముంజంపల్లిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వివిధ కులవృత్తులకు బీసీ బంధు కింద మంజూరైన ఆర్థికసాయం, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలని, కులవృత్తులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. నియోజకవర్గంలోని 192 మంది బీసీలకు లక్ష రూపాయల చెక్కులను, 48 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బీసీ బంధు ఆరంభం మాత్రమేనని రాష్ట్రంలో ప్రతిఒక్క బీసీకి లబ్ధి చేకూరుతుందన్నా రు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ రాబోయే రోజుల్లో విపక్షాలకు ఓటుద్వారా సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా బెజ్జంకి మండలానికి చెందిన లబ్ధిదారుడు జనగాం దామోదర్ భావోద్వేగంతో మాట్లాడాడు. నాయీబ్రాహ్మణ వృత్తి చేసుకుంటున్న పేదవాడిని అధికారులు, నాయకులు గుర్తించి లక్షరూపాయల ఆర్థికసాయం అందించినందుకు కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటానని అన్నాడు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పృథ్వీరాజ్, ఎంపీపీ సులోచన, జడ్పీటీసీ శేఖర్, ఎంపీడీఓ ద్విదర్శన్‌రావు, వివిధగ్రామాల సర్పంచులు, వివిధ మండలాల అధికారులు, ఎంపీటీసీలు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగులో ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

రామడుగు: రామడుగు మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన టైటాన్, రన్నర్ రాయల్, మూడో స్థానంలో నిలిచిన ఫిరోజ్ జట్లకు ట్రోఫీలను ఆదివారం రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్, జడ్పీటీసీ మార్కొండ లక్ష్మికిష్టారెడ్డి అందజేశారు. టోర్నీలో అద్భుతంగా రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ప్రదానం చేశారు. సర్పంచులు ప్రమీలజగన్మోహన్ గౌడ్, రాజేశ్వరీలచ్చయ్య, ఎంపీటీసీ దేవికరాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మునీందర్, వెంకటరమణ రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రామడుగు: ఓ వైపు ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్‌శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభాలు ఓ వైపు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయని మొరపెట్టుకుంటున్నా సరిచేయడంలేదని మండలంలోని వెదిర గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మాస్కకుంటకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం ఎప్పుడు పడిపోతుందో తెలియదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేసి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

▲ నాయకుల పరామర్శ

హుజూరాబాద్: పట్టణంతోపాటు మున్సిపల్ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్‌లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఆదివారం పరామర్శించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గందే రాధిక మామ గందె సాంబయ్య, జర్నలిస్టులు కుడికాల సాయి తల్లి, గూడూరు కొండారెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిన శ్రీనివాస్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అశోక్ గౌడ్, కాజీపేట కృష్ణ కాజీపేట శ్రీనివాస్, సదానందం, సమ్మయ్య, మహేందర్ యాదవ్, లక్ష్మణమూర్తి, మాజీ సర్పంచ్ భిక్షపతి, డాక్టర్ బుచ్చిబాబు, బీఎస్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: భూమి విషయంలో అన్యాయం జరుగుతోందని మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కనకవ్వ పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. మహిళ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ఉన్నతాధికారులు తక్షణం స్పందించి న్యాయం చేయాలని కోరారు. కాగా భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని అనిల్ కవ్వంపల్లికి తెలిపాడు. వెంట మురళీకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

▲ కల్వల ప్రాజెక్టు గండికి మరమ్మతులు

శంకరపట్నం: కల్వల ప్రాజెక్టు గండిని క్వారీ నిర్వాహకులు జేసీబీతో పూడ్చుతున్నారు. వరిపంటలకు సాగునీరందించేందుకు ఆదివారం గండి మరమ్మతు పనులు చేపట్టామని సర్పంచ్ భద్రయ్య తెలిపారు.

▲ ప్రభుత్వ ఆఫీస్‌లో పార్టీ మీటింగ్

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయం అధికార బీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌లకు వేదికైందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఈ నెల12న రెండో శనివారం సెలవు దినం కావడంతో ఎంపీడీవో కార్యాలయం తాళం తీసి బీఆర్ఎస్ పార్టీ సావేశం నిర్వహించారని. ప్రభుత్వ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆధ్యాత్మికం



హనుమాన్ చాలీసా పారాయణం

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని సాయి మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చొప్పదండి: మండల కేంద్రంలో ఆదివారం విద్యాభారతి ఉన్నత పాఠశాల 1995–96 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991–92 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కోర్కల్ గ్రామానికి చెందిన కర్ర రామచంద్రారెడ్డి గాంధీ విగ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంబంపాటి పున్నం చందర్, చింత రవీందర్‌రెడ్డి, విగ్రహదాత కర్ర రామచంద్రారెడ్డి, అశోక్, అనిల్, రాంపల్లి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, అనసూయ, వాసవి పాల్గొన్నారు.



వీణవంక: 1991-92 పదో తరగతి విద్యార్థులు



చొప్పదండి: గురువులతో పూర్వ విద్యార్థులు